సాక్షి నిజామాబాద్


గురువారం । 18 । జనవరి । 2024



క్రీడాకారులు ఎదగాలి

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎదగాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సూచించారు.

- 10లో ▸



ఆనకట్ట రక్షణపై పట్టింపేది?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆనకట్ట అధ్వానంగా మారింది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

- 12లో ▸

గరిష్టం/కనిష్టం
21.2 /20.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాక్లూర్: కేంద్ర ప్రభుత్వం అందించే ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. మండలంలోని అమ్రాద్ తండాలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారులకు ముద్ర రుణాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గ్రామాల్లోని యువత రుణాలు తీసుకుని చిరు వ్యాపారాలు ప్రారంభించుకోవాలని సూచించారు. పేదల సంక్షేమం కోసం కేంద్రం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను అక్కడ పోలీసులు వేధిస్తున్నారని తండావాసులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీ సంబంధిత పోలీసు అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. సర్పంచ్ మెగావత్ కిషన్‌లాల్, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, ఏపీవో ఓంకార్, మండల వ్యవసాయ అధికారి పద్మ, పశువైద్యాధికారి ఉమా సహెర్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ పాల్గొన్నారు.

బైకుపై అయోధ్యకు..



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని లక్కంపల్లి, షాపూర్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు బుధవారం బైకుపై అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. షాపూర్‌లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి బయలుదేరారు. రామ మందిరం ప్రారంభోత్సవంతో పాటు ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో లక్కంపల్లికి చెందిన గోపరి సాయిలు, గోపరి భూమన్న, సిరిపురం రవి, గంగాధర్, షాపూర్‌కు చెందిన కొండాపూర్ లక్ష్మణ్, సర్దార్ నాగేశ్‌లు ఉన్నారు. యాత్రను బీజేపీ రాష్ట్ర నాయకులు బద్దం లింగారెడ్డి, అరుట్ల రమేశ్, పుల్లూరు గంగాధర్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.

మహేశ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ



- ఇప్పటికే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రియాశీలక పాత్ర
- ఎన్‌ఎస్‌యూఐ మొదలు నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన ఫలితం
- పార్లమెంట్ ఎన్నికల తరువాత పీసీసీ పీఠం సైతం అప్పగించే అవకాశం
- ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవిని అధిష్టానం కేటాయించింది. ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ కోసం నిరంతరం పాటుపడుతూ వచ్చారు. అనేక పార్టీ పదవులు నిర్వహిస్తూ వచ్చిన మహేశ్‌గౌడ్ ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల విషయమై అనేక ఉత్కంఠ భరిత పరిస్థితుల మధ్య చివరి నిముషంలో ఖరారు కావడంతో జిల్లా పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ రెండు స్థానాలకు సంబంధించి బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ పేర్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురయ్యారు. అయితే చివరి నిముషంలో అద్దంకి దయాకర్ స్థానంలో మహేశ్‌కుమార్ గౌడ్ పేరును అధిష్టానం ప్రకటించడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శక్తివంచన లేకుండా కృషిచేసిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్లమెంట్ ఎన్నికల తరువాత పీసీసీ అధ్యక్ష బాధ్యతలు సైతం అప్పగించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

● మరోవైపు బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు తెలుస్తోంది. సుదర్శన్‌రెడ్డి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖరారైనట్లు తెలుస్తోంది. రెండో విడతలో తప్పకుండా ఇస్తారని శ్రేణులు భావిస్తున్నాయి. అయితే మంత్రివర్గ విస్తరణ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉంటుందా, ఎన్నికల తరువాత ఉంటుందా అనే విషయమై ఉత్కంఠ నెలకొంది.




నగరంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వద్ద సంబురాలు చేసుకుంటున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్ టికెట్ త్యాగం

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఉత్తర తెలంగాణ నుంచి, మరోవైపు బీసీ కావడంతో పీసీసీ అధ్యక్ష పదవి బాధ్యతలు సైతం అధిష్టానం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్‌గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు ఆశించారు. అయితే ఈ స్థానంలో మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టిన నేపథ్యంలో అధినాయకత్వం సూచన మేరకు టికెట్టును షబ్బీర్ అలీ కోసం త్యాగం చేశారు. పైగా పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలోనే పార్టీ అధినాయకత్వం మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు పీసీసీ పీఠం అప్పగించనున్నట్లు తెలుస్తోంది. నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీ దక్కడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి మార్పు?

- పల్లె గంగారెడ్డి, కులాచారి దినేశ్‌లలో ఒకరికి బాధ్యతలు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకత్వం సన్నాహాలు
- పార్టీ శ్రేణుల్లో ఆసక్తి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీజేపీ నాయకత్వం రాష్ట్రంలో పలు జిల్లాల పార్టీ అధ్యక్షులను మార్పు చేసేందుకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడిని సైతం మార్చనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ అధినాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే కీలకమైన పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్ష పదవిని మార్చే విషయమై పకడ్బందీగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆలోచన మేరకు కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. జిల్లా అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నాయకుడు, ప్రస్తుత రాష్ట్ర పార్టీ కార్యదర్శి, గతంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పల్లె గంగారెడ్డి గానీ, డిచ్‌పల్లి మాజీ జెడ్పీటీసీ కులాచారి దినేశ్‌కు గానీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పల్లె గంగారెడ్డి మొదటి నుంచి బీజేపీలో సుశిక్షితుడైన కార్యకర్తగా పనిచేస్తూ వస్తున్నారు. సంఘ్‌పరివార్‌తో కలిసి పల్లె గంగారెడ్డి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లారు. దీంతో పల్లెకు పార్టీ నాయకత్వం వద్ద మంచి గుర్తింపు ఉంది. పార్టీ ఆర్గనైజింగ్ కార్యకలాపాల నిర్వహణ విషయంలో దిట్టగా గంగారెడ్డికి పేరుంది. ప్రస్తుత పార్టీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో సైతం పల్లె గంగారెడ్డి అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం సీనియర్ నేతకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని భావిస్తే పల్లె గంగారెడ్డికే అప్పగించనున్నట్లు పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలను పార్టీ నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా నిజామాబాద్ సీటుపై భారీ ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో పల్లెకు బాధ్యతలు ఇవ్వొచ్చనే అంచనాలున్నాయి.

● ఇక మాజీ జెడ్పీటీసీ కులాచారి దినేశ్‌కు సైతం జిల్లా పార్టీ నాయకత్వం బాధ్యతలు అప్పగించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల క్రితం పార్టీలో చేరిన దినేశ్ గతంలో టీడీపీలో డిచ్‌పల్లి జెడ్పీటీసీగా పనిచేశారు. తరువాత కాలంలో బీఆర్‌ఎస్ తరుపున దినేశ్ సతీమణి దివ్య నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గానూ వ్యవహరించారు. ఇదిలా ఉండగా కులాచారి దినేశ్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నుంచి పోటీ చేసి 50 వేల వరకు ఓట్లు సాధించారు. దీంతో దినేశ్ నాయకత్వంపై అంచనాలు పెరిగాయి. ఈ క్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం పార్టీ నాయకత్వం దినేశ్ పేరును సైతం పరిశీలిస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే పార్టీ అధ్యక్ష బాధ్యతలను మార్పు చేయాలనుకుంటున్న పార్టీ నాయకత్వం సీనియర్ నేత పల్లె గంగారెడ్డికి బాధ్యతలు ఇస్తుందో లేక దినేశ్‌కు అవకాశం కల్పిస్తుందో అనే విషయమై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

షబ్బీర్ అలీకి నిరాశ!

- దక్కని ఎమ్మెల్సీ అవకాశం
- మాజీ మంత్రి అనుచరుల్లో నిర్వేదం

సాక్షి, కామారెడ్డి: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్‌అలీకి నిరాశే ఎదురైంది. ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాల్లో కాంగ్రెస్ తరఫున ఒకటి షబ్బీర్‌అలీకి దక్కుతుందని ఆయన అనుచరులు భావించారు. అదే నమ్మకంతో ఆయనకు ఎమ్మెల్యే కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారంటూ ప్రచారం చేసుకున్నారు. అయితే బుధవారం కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించిన జాబితాలో షబ్బీర్ అలీ పేరు లేకపోవడం ఆయన అనుచరులను నిరాశకు గురిచేసింది.

'సాలూర ఎత్తిపోతల' పున:ప్రారంభం

- 1600 ఎకరాలకు సాగు నీరు
- హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నీటివిడుదలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

బోధన్: సాలూర ఎత్తిపోతల పథకం తిరిగి ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో ఆయకట్టు రైతులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. ఎత్తిపోతలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎమ్మెల్యే సుమారు రూ. 8 లక్షల సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేయించినట్లు రైతులు తెలిపారు. సాలూర ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను నాలుగు నెలల క్రితం దుండగులు ధ్వంసం చేసి, అందులోని తీగలు, ఆయిల్‌ను అపహరించారు. మరమ్మతులకు రూ. 8 లక్షల నుంచి 10 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఎత్తిపోతల పథకం నిర్వాహణ కమిటీ వద్ద అంత మొత్తంలో డబ్బులు లేక మరమ్మతులు చేయించలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్వాహణ కమిటీ, గ్రామ రైతులు ఈ విషయాన్ని సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో బుధవారం ఎత్తిపోతల పథకాన్ని నిర్వాహణ కమిటీ, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి పున:ప్రారంభించారు. దీని కింద వరి, శనగ, ఇతర ఆరుతడి పంటలకు కలిపి సుమారు 1600 ఎకరాలకు సాగునీరు అందనుంది. గ్రామ రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నిర్వాహణ కమిటీ ప్రతినిధులు భయ్యన్ సురేష్ పటేల్, మైదపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారి ఆగడాలకు అంతేది..!

- ఇసుక అక్రమ రవాణాలో మామూళ్లు
- మాజీ ప్రజాప్రతినిధికి వంతపాడిన వైనం
- ఎన్నికల సమయంలోనూ ఆయన తీరు వివాదాస్పదం
- డీజీపీ చెంతకు చేరిన సబ్ డివిజన్‌లోని అధికారి అక్రమాల చిట్టా..!



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఓ మాజీ ప్రజాప్రతినిధి అండతో ఓ సబ్ డివిజన్‌లోని అధికారి తాను ఆడిందే ఆటగా నడిపించారు. సామాన్యుల కోసం కనీసం స్పందించని ఆ అధికారి.. సదరు మాజీ ప్రజాప్రతినిధి, పార్టీ లీడర్లు చెబితే మాత్రం క్షణాల్లో పనులు చక్కబెట్టేవారు. ఎన్నికల సమయంలోనూ సదరు పోలీసు అధికారి వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. ఒకానొక సమయంలో ఈ డివిజన్‌లోని కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలకు సంబంధించిన నాయకులు సదరు మాజీ ప్రజాప్రతినిధిపై ఆరోపణలు చేస్తే.. వెంటనే వారికి వార్నింగ్‌లు వెళ్లిన ఘటనలున్నాయి. అంతటితో ఆగకుండా ఆయనకు కావాల్సిన నేత, ఆ పార్టీ నాయకులకు సంబంధించిన పలు కేసులను నీరుగార్చారనే ఆరోపణలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సదరు ప్రజాప్రతినిధి ఓటమి పాలవడంతో.. తన ఆటలు సాగవని భావించిన సదరు పోలీసు అధికారి వ్యక్తిగత సెలవులో వెళ్లారు. వేరే ప్రాంతానికి బదిలీ కోసం పైరవీలు చేసినా ఫలితం లేకపోవడంతో తిరిగి వచ్చి విధుల్లో చేరినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మాజీ ప్రజాప్రతినిధికి సన్నిహితుడిగా..

సదరు పోలీసు అధికారి డివిజన్‌లో విధుల్లో చేరిన నాటి నుంచి మాజీ ప్రతినిధికి అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధి అనుమతి లేకుండా నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో చీమ కూడా చీటుక్కుమనేది కాదని ప్రచారంలో ఉంది. సదరు నేత సోదరుడి కనుసన్నల్లో మంజీర, గోదావరి నది నుంచి నడిచే ఇసుక అక్రమ రవాణాలో ఈ అధికారి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ దందాలో ఆయనకు మామూళ్లు పెద్ద మొత్తంలో ముట్టినట్లు శాఖలోని పోలీసులు చర్చించుకునేవారు. ఓ యువకుడి ప్రేమ వ్యవహారంలో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. ఎన్నికల సమయంలో కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు సదరు మాజీ ప్రజాప్రతినిధిని అడ్డుకుంటున్నారని కేసులు నమోదు చేశారు. ఓ మండలంలో అధికారి చెప్పడంతోనే లాఠీచార్జ్ జరిగిందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాధితులు అప్పుడు సీపీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అన్ని వివరాలతో..

సబ్‌డివిజన్‌లోని సదరు అధికారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన పోలీసులు విచారణకు సంబంధించిన ఫైల్‌ను డీజీపీ రవిగుప్తా వద్దకు పంపినట్లు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. ఈ ఫైల్‌లో సదరు అధికారి పనిచేస్తున్న డివిజన్‌కు వచ్చిన నాటి నుంచి ఎన్నికల వరకు జరిగిన ఘటనలకు సంబంధించిన వివరాలను పొందుపర్చినట్లు సమాచారం. దీంతో సదరు అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే చర్చ పోలీస్‌శాఖలో జరుగుతోంది.

రేవంత్‌రెడ్డి రెడ్ డైరీలో అధికారి పేరు..

ఎన్నికల్లో ఓ పార్టీకి కొమ్ముకాస్తున్నారని కాంగ్రెస్ లీడర్లపై లాఠీచార్జ్ చేశారని కామారెడ్డి పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి దృష్టికి నాయకులు తీసుకువెళ్లారు. సదరు అధికారి పేరును రెడ్ డైరీలో రాసుకున్నట్లు కామారెడ్డి సభలో ఆయన ప్రకటన చేశారు. అయితే ఎన్నికల ఫలితాలకు ముందు డిసెంబర్ 1న జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రాను సదరు పోలీసు అధికారి తనకు సన్నిహితంగా ఉండే కాంగ్రెస్ నేతలతో జిల్లా కేంద్రంలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో కలిసి తన గోడు చెప్పుకున్నట్లు తెలిసింది.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న సెక్యూరిటీ గార్డు

- గంటన్నర పాటు నరకయాతన
- నగరంలోని కోటగల్లిలో ఘటన
- కాపాడిన ఫైర్ రెస్క్యూటీం



లిఫ్ట్‌లో సెక్యూరిటీగార్డు ఇరుక్కుపోగా బయటకు కనబడుతున్న కాళ్లు

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లిలో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సెక్యూరిటీ గార్డు బుధవారం లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి గంటన్నర పాటు నరకయాతన పడ్డాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. సెక్యూరిటీ గార్డు మహేందర్‌గౌడ్ లిఫ్ట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో కాళ్లు బయట, బాడీ లోపల ఇరుక్కుపోయింది. మహేందర్ కేకలు వేయడంతో స్థానికులు గమనించి వెంటనే ఫైర్ రెస్క్యూ బృందానికి సమాచారం ఇచ్చారు. నిజామాబాద్ ఫైర్‌స్టేషన్‌కు చెందిన రెస్క్యూ బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అరగంట పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ సెక్యూరిటీ గార్డును 108లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కొన్ని రోజులుగా లిఫ్ట్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.



లిఫ్ట్ నుంచి బయటపడిన మహేందర్

కళ్యాపూర్‌లో 'డబుల్' లొల్లి

- అధికారికంగా కేటాయించకుండానే ఇళ్లు శుభ్రం చేసుకున్న లబ్ధిదారులు
- ఎస్సై, తహసీల్దార్ చొరవతో రూంలకు తాళాలు వేసిన అధికారులు



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్‌లో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల పంపిణీ గ్రామంలో చర్చకు దారితీసింది. బుధవారం ఈ విషయంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తహసీల్దార్ సర్దిచెప్పినా కబ్జాదారులు వినకపోవడంతో ఎస్సై గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. గ్రామంలో 30 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కాంట్రాక్టర్ రెండేళ్ల కింద పూర్తిచేశారు. అయితే రెవెన్యూ, హౌసింగ్ అధికారులు గతేడాది ఎలాంటి విచారణ చేపట్టకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారనే విమర్శలున్నాయి. అధికారులు ఎంపిక చేసిన జాబితాను పరిగణనలోకి తీసుకున్న సర్పంచ్ కుటుంబీకులు వారం రోజుల క్రితం గృహాలకు నంబర్లు కేటాయించారు. తాజాగా బుధవారం గృహాలకు సంబంధించిన తాళాలు లబ్ధిదారులకు అందించడంతో వారు ఇళ్లను శుభ్రం చేసుకోవడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గ్రామానికి చేరుకుని అధికారికంగా గృహాలను కేటాయించలేదని.. అప్పటి వరకు కబ్జా చేయడం చట్ట విరుద్ధమని లబ్ధిదారులను సముదాయించారు. అయినా వారు వినకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని లబ్ధిదారులను సముదాయించారు. అధికారికంగా ప్రారంభోత్సవం నిర్వహించిన తర్వాతే గృహ ప్రవేశాలు చేసుకోవాలని.. లేకపోతే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించడంతో లబ్ధిదారులు సద్దుమణిగారు. సర్పంచ్ కాశం నిరంజని సాయిలు అక్కడికి చేరుకుని అధికారికంగా గృహ ప్రవేశాలు చేసుకుందామని సర్ది చెప్పడంతో లబ్ధిదారులు గృహాలను ఖాళీచేసి తాళాలను కార్యదర్శికి అందించారు.

రైతులు బహూకరించిన నాగలితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, నేతలు వినయ్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి



-వివరాలు 8లో..

రైతు డిక్లరేషన్ అమలు చేస్తాం

క్లుప్తంగా

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం జిల్లాకేంద్రంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ అర్వింద్‌కు పెన్షనర్లు, ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్, ఆర్ఎంఎస్, బీఎస్ఎన్ఎల్, ఆలిండియా రేడియో, పీఎఫ్, ఇన్‌కమ్ ట్యాక్స్, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ప్రతాప్‌రెడ్డి, భూషణం, నారాయణ, షేక్ హుస్సేన్, రాజశేఖర్, నవీన్, రవి, నారాయణ, గంగాధర్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవకు ముస్లింల విరాళం



సిరికొండ: అయోధ్యలో ఈ నెల 22న నిర్వహిస్తున్న ప్రాణప్రతిష్ట సందర్భంగా మండల కేంద్రంలోని లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నారు. రామయ్య సేవలో తాము సైతం అంటు స్థానిక ముస్లింలు ముందుకు వచ్చి గ్రామ కమిటీ సభ్యులకు రూ. 5100 విరాళాన్ని బుధవారం అందచేశారు. కార్యక్రమంలో మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సలాం చావుష్, సలావుద్దీన్, జావీద్, సలీం, మతీన్, అసద్‌బిన్ ఆమేర్, సలీం, మోసీన్, యూనుస్, వీడీసీ చైర్మన్ బడాల సంతోష్, వైస్ చైర్మన్ గంగారాం, గోపి, ప్రవీణ్, రాజేందర్‌గౌడ్, శ్రీధర్, శ్రీనివాస్, లింగం, శివారెడ్డి, సురేశ్, మధు, చింటు, బాబురావు, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్ జోషి (నిజామాబాద్), ప్రధాన కార్యదర్శిగా హన్మంతరావు (కామారెడ్డి), కోశాధికారిగా సంగం సంతోష్(నందిపేట్), ఉపాధ్యక్షుడిగా మైసయ్య ఠాకూర్ (బాన్సువాడ), సంయుక్త కార్యదర్శిగా అరుణ్ కుమార్ (డిచ్‌పల్లి), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్(బోధన్), బాలాజీరావు (కామారెడ్డి), సంఘ గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ రజినీకాంత్ (నిజామాబాద్), ముఖ్య సలహాదారుడిగా ముజీబ్ అలీ(నిజామాబాద్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వరదారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరు తిరుపతి రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రేపు ప్రగతి భవన్‌కు వెళ్లనున్న కార్మికులు

బోధన్: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో శుక్రవారం నిర్వహించే ప్రజావాణికి మూడు ఎన్డీఎస్ఎల్ యూనిట్ల కార్మికులు వెళ్లనున్నారు. నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌ను 2015లో ఫ్యాక్టరీ ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) యూనిట్లను మూసివేసిన విషయం తెలిసిందే. ఫ్యాక్టరీ లేఆఫ్ నాటి నుంచి కార్మికులకు నెలసరి బకాయి వేతనాలు చెల్లించలేదు. దీంతో కార్మికుల సమస్యలు విన్నవించేందుకు మూడు ఫ్యాక్టరీ కార్మికులు సంసిద్ధమయ్యారు. ప్రజావాణికి వెళ్లి రాతపూర్వకంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బోధన్ ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ బుధవారం తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావంతో ఉన్నామని పేర్కొన్నారు.

రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తాం

- ఈ నెలాఖరులోగా రైతుల ఖాతాల్లో 'రైతు బంధు'
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆంధ్రానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

నందిపేట్(ఆర్మూర్): ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఆంధ్రానగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన దివంగత నందమూరి తారకరామారావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చిన తామంతా, ఆ మహానుభావుని ఆశయాలకు అనుగుణంగా అదే నిబద్ధతతో, నిజాయితీగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులు కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నా రైతాంగ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. ఇప్పటికే రెండెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు రేపటి నుంచి వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు లోగా రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయని స్పష్టం చేశారు.

ఆర్మూర్ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకరించి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కోరారు. తాను చిన్ననాటి నుంచి ఎన్టీఆర్ అభిమానిని అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, జాయింట్ కలెక్టర్ యాదిరెడ్డి, వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నాయుడు రామారావు, ఎంపీటీసీ గంజుపల్లి రాధాశీను, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్



మంత్రితో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: జిల్లా పర్యటనలో భాగంగా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ఇంట్లో మంత్రి అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఆరికెల నర్సారెడ్డి, నాగేశ్‌రెడ్డి, అజార్‌కిషన్‌రావు, ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మాగౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి నాగేశ్వరరావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

మంత్రిని కలిసిన జిల్లా వ్యవసాయాధికారి

డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి వచ్చిన మంత్రి నాగేశ్వరరావును జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్‌తో పాటు ఏడీఏ, ఏవోలు, ఏఈవోలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, డిచ్‌పల్లి, ధర్పల్లి మండలాల వ్యవసాయాధికారులు రాంబాబు, ప్రవీణ్, ఏఈవోలు అశ్రిత, నృపేశ్‌కుమార్, భావన, సంధ్య, వంశీ తదితరులు ఉన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన రూరల్ ఎమ్మెల్యే

ఇందల్వాయి: జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నాగేశ్వరరావుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట డీసీసీ కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి తుమ్మలకు వినతుల వెల్లువ..

నిజామాబాద్ రూరల్(జక్రాన్‌పల్లి): జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును జక్రాన్‌పల్లి నాయకులు మండల కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో మంజూరు అయిన గుత్ప, మునిపల్లి జక్రాన్‌పల్లి లిఫ్ట్ గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదన్నారు. రైతుల ప్రయోజనార్థం లిఫ్ట్ పనులతో పాటు మండలానికి 132 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మాజీ ఎంపీపీ కాంతి అనంతరెడ్డి, క్యాతం రాజారెడ్డి, పోగుల భాస్కర్, నరేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



శ్యాంసుందర్(ఫైల్)

బాన్సువాడ/ బాన్సువాడ రూరల్: పొలం గట్టుపై నుంచి పడి బురదలో కూరుకుపోయిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసం ఉంటున్న శ్యాంసుందర్‌గౌడ్ (41) మద్యానికి అలవాటు పడి ఏ పనిచేసేవాడు కాదు. ఇంటి నుంచి మంగళవారం వెళ్లిన అతను ఇంటికి చేరుకోలేదు. బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువు కింద ఉన్న పొలంలో మలవిసర్జన కోసం వెళ్లగా గట్టుపై నుంచి కిందపడ్డాడు. మద్యం మత్తులో ఉన్నందున బురదలో కూరుకుపోయి మృతి చెంది ఉంటాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య అంబిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు..

గాంధారి: ట్రాక్టర్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న చద్మల్ తండాకు చెందిన బామన్ ఉద్దల్ సింగ్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి..



గురుదాస్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్: మద్యం మత్తులో ఓ యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలోని బేగంపూర్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లంబాడి గురుదాస్(28) పొలం పనులు చేస్తుంటాడు. పొలంలో మంగళవారం మద్యం తాగిన గురుదాస్ అదే మత్తులో పంటకు సంబంధించిన పురుగుల మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబీకులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబాయిలో రాజంపేట వాసి మృతి



జొన్నల రవి(ఫైల్)

రాజంపేట: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జొన్నల రవి (35) ఉపాధి నిమిత్తం తొమ్మిదేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: మండల కేంద్రం నుంచి వీరన్నగుట్ట గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు తేలడంతో డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

బెల్ట్ షాప్‌పై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కమిషనరేట్ పరిధిలోని నందిపేట్ మండలం బాద్గుణలో బద్దం నాగరెడ్డికి చెందిన బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐలు అంజయ్య, అజయ్ బాబు బుధవారం దాడి చేశారు. రూ. 40 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గాంధీనగర్‌కు చెందిన రాజ్‌కుమార్, టెన్నీలు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మరొకరికి పదిరోజులు..

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్షను జడ్జి సయ్యద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో వినాయక్‌నగర్‌కు చెందిన బాబు మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఖదీర్ 10 రోజుల జైలు శిక్షను విధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో 22 కేసులలో వాహనదారులకు రూ. 26,500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏటీఎంను ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: ఏటీఎం ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి బుధవారం తెలిపారు. నగరంలోని మిర్చి కంపౌండ్‌కు చెందిన పడమటి రమేశ్ గత నెల డిసెంబర్ 18న అర్సపల్లిలో ఉన్న ఏటీఎంను ధ్వంసం చేయగా అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అలాగే ఈ నెల 12న గోశాలరోడ్‌లోని ఏటీఎంను ధ్వంసం చేయగా అలారం మోగడంతో బ్యాంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టౌన్ సీఐ నరహరి, సిబ్బంది ఉన్నారు.

నాందేవ్‌వాడలో మట్కా నిర్వాహకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన అల్గాయ్ రోహిత్ మట్కా ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అతని నుంచి రూ. 2300 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్ దొంగతనం కేసులో నిందితుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడవ టౌన్ పరిధిలో బైక్ దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ బుధవారం తెలిపారు. ఈ నెల15న కంఠేశ్వర్‌కు చెందిన తిరుపతి తన బైక్‌ను సుభాష్‌నగర్‌లోని ఓ హోటల్ ఎదుట పార్క్ చేసి వెళ్లగా బయటకు వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణలో హమాల్‌వాడికి చెందిన రాజే రంజిత్‌ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

నందిపేట్: మండలంలోని బాద్గుణ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేయగా వీరి నుంచి రూ.23,340 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన జ్యోత్స్న తన ఇంటికి తాళం వేసి రాజారాంనగర్‌లో ఉండే అత్తాగారింటికి శుభకార్యం నిమిత్తం వెళ్లింది. గమనించిన దుండగులు రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. దుండగులు రెండు తులాల బంగారం, రూ. రెండున్నర లక్షల నగదు, విలువైన ఎలక్ట్రికల్ వస్తువులను చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు పేర్కొన్నారు.

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న తిరుమల కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోండ్ల ప్రవీణ్‌తో పాటు అదే ఇంటిపై అద్దెకు ఉంటున్న శ్రీకాంత్ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ప్రవీణ్ ఇంట్లో సుమారు 14 తులాల బంగారంతో పాటు రూ. 9వేల నగదు, శ్రీకాంత్ ఇంట్లో ఐదు తులాల వెండిని దుండగులు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్నిలో జోరుగా వ్యభిచారం

- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని పోలీసులు

వర్ని: మండల కేంద్రంలో జోరుగా వ్యభిచారం కొనసాగుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన కాలువ పక్కన ఉండే ఓ మహిళ తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఆమెను హెచ్చరించినా పద్ధతి మార్చుకోవడం లేదంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు నామమాత్రపు తనిఖీలు చేపట్టి వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సదరు మహిళ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుండడంతో ఆ పరిసర ప్రాంతమంతా అసభ్యంగా తయారైందని ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు వారికి అండగా నిలవడంపైప్రజలుఅనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తండాలో సైతం..

మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఓ తండాలో మరో మహిళ సైతం వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తండావాసులు పేర్కొంటున్నారు. తనిఖీలకు వచ్చిన పోలీసు సిబ్బంది సైతం వారికి అండగా నిలుస్తున్నారు. ఇటీవల వ్యభిచార గృహాలకు వెళ్లిన విటుల నుంచి వారు కుదుర్చుకున్న డబ్బులతో పాటు అదనంగా లాక్కుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై పలుమార్లు ఘర్షణలు జరిగి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా చర్యలు తీసుకోవడంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అసౌకర్యంగా మారిన వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించి నిర్లక్ష్యంగా వహిస్తున్న పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు వస్తే హెచ్చరించాం

మండలంలోని ఓ తండాలో వ్యభిచారం నడుస్తుందనే విషయంపై ఫిర్యాదు రావడంతో సదరు మహిళను హెచ్చరించాం. తండాలో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించాం. ఎక్కడైనా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

–కృష్ణ కుమార్, ఎస్సై, వర్ని

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పిప్రిరోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అండర్-14 బాల, బాలికల టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఆర్మూర్‌లోని అన్ని పాఠశాలలను ఐదేళ్లలో తీర్చిదిద్దుతానని, పేద బలహీన బడుగు వర్గాల విద్యార్థులు క్రీడలు, విద్యలో ఉన్నత స్థానానికి చేరుకునేటట్లు చేయడమే తన మొదటి ప్రాధాన్యత అని అన్నారు. క్రీడకారులు నిరంతరం శిక్షణ పొంది ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి గౌడ్, ఉపాధ్యక్షుడు పెంట జలంధర్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, స్కూల్ గేమ్స్ రాష్ట్ర పరిశీలకులు యూనిస్ పాషా, నాగరాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

రుద్రూర్: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జల్సాల కోసం బైక్ దొంగతనాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి

ఖలీల్‌వాడి: జల్సాలు, కుటుంబ పోషణ భారమై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని చంద్రనగర్‌కు చెందిన న్యాలకంటి శేఖర్, వినాయకనగర్‌లోని శ్రీనగర్‌కు చెందిన ఆరూర్ సతీశ్‌లు నాలుగు బైక్‌లు దొంగతనం చేసినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్‌లోని చెట్ల పొదలలో బైక్‌లను దాచి బస్టాండ్ వెనుకాల వీటిని విక్రయిస్తుండగా నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. విచారణలో దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ నరహరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలో బుధవారం పవర్ పబ్లిక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్స అంజనేయులు మాట్లాడుతూ.. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం ఒకరికి ప్రాణదానమని పేర్కొన్నారు. శిబిరంలో వంద మందికి పైగా యువకులు రక్తదానం చేశారని యూత్ అధ్యక్షుడు విజయ్ తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు సుమన్, నర్సాగౌడ్, గంగాధర్, ప్రశాంత్, అజయ్, సాగర్, నడ్పి గంగారాం పాల్గొన్నారు.

రోటరీ జేమ్స్ సేవలు అభినందనీయం



నిజామాబాద్ సిటీ: సమాజంలో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని క్లబ్ మాజీ గవర్నర్, స్పీకర్ హన్మంత్ రెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం రోటరీ జేమ్స్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హన్మంత్‌రెడ్డి స్పీకర్‌గా హాజరై మాట్లాడారు. రోటరీ జేమ్స్ సేవలు సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని, సేవలను మరింత విస్తృతం చేయాలని సభ్యులకు సూచించారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు భూలోకం విజయ్‌కాంత్‌రావు, ఇన్‌చార్జి కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు రంజిత్‌సింగ్ ఠాకూర్, సూర్యప్రకాష్, గిరీష్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గురు గోవింద్ జయంతి వేడుకలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని గురుద్వార్‌లో బుధవారం సిక్కుల ఆరాధ్యదైవం 10వ గురు గోవింద్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురుద్వార్ పూజారి సోన్‌సింగ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశానికి గురు గోవింద్ సింగ్ కుటుంబం చేసిన త్యాగాల గురించి గురుద్వార్ కమిటీ అధ్యక్షుడు రజ్జుసింగ్ వివరించారు. కమిటీ సహాయ కార్యదర్శి మహేందర్ సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూర్ వెంకట్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరుపున డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వీరి నియామకానికి సహకరించిన పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి కృతజ్ఞతలు తెలిపారు.

కవి ప్రేమ్‌లాల్‌కు సన్మానం



నిజామాబాద్ సిటీ: నగరంలో బుధవారం తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి ప్రేమ్‌లాల్‌ను గీతాంజలి సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రేమ్‌లాల్ సాహిత్య రంగంలో అద్భుతంగా రాణిస్తూ కవితారచనలు చేస్తూ, యువ కవులకు ఆదర్శంగా నిలస్తున్నారని వక్తలు కొనియాడారు. తెరవే కార్యదర్శి వేముల శేఖర్, మల్లేశం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన పందెన గోవర్ధన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడికి గల్ఫ్ మిత్రులు, గ్రామంలోని స్నేహితులు ముందుకు వచ్చి ఆర్థికంగా అండగా నిలిచారు. మిత్రులందరూ డబ్బులు జమ చేసి రూ.67,750 ఆర్థిక సహాయాన్ని బుధవారం గోవర్ధన్‌కు అందించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



అయోధ్య రామమందిరం ముగ్గు వేసిన గుండాల వర్ష (ప్రథమ బహుమతి)



ముగ్గుల పోటీల విజేతలతో నిర్వాహకులు

సుభాష్‌నగర్: నగరంలోని ఆదర్శ్‌నగర్‌లోగల విశ్వ హిందూ పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం వీహెచ్‌పీ, దుర్గావాహిని మాతా శక్తి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను ఆయా సంఘాల ప్రతినిధులు నిర్వహించారు. పలువురు మహిళలు సమాజానికి సందేశానిచ్చే విధంగా ఎంతో చక్కని రంగవల్లులు వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా నాయకురాలు ధన్‌పాల్ అంజలి మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుండాల వర్ష (మొదటి బహుమతి), సాహితి (రెండో బహుమతి), అలాగే కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అయోధ్య రామమందిరం నమూనా, సీతారాములు ఉన్న ముగ్గు అందరినీ ఆకట్టుకుంది. సంఘ ప్రతినిధులు సుబేదార్, ఝాన్సీ కపిల్, గాజుల దయానంద్, ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎక్సైజ్ ఎస్సై మల్లేష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

మోపాల్(నిజామాబాద్‌రూరల్): యువత క్రీడాపోటీలపై ఆసక్తి చూపాలని, ఆటల పోటీలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ పేర్కొన్నారు. మండలంలోని మంచిప్పలో బుధవారం జై భారత్ యూత్ అధ్యక్షుడు నాయుడు సాయిరాం ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. స్వామి వివేకానంద సూచించిన బాటలో నడుస్తూ వారిచ్చిన ప్రసంగాలు, సూక్తులను మననం చేసుకుంటూ తమ భవిష్యత్‌ను సక్రమంగా మల్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో గంజాయి, మత్తుపదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారమందించాలని కోరారు. 20ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జై భారత్ యువజన సంఘానికి అభినందనలు తెలియజేశారు. సర్పంచ్ సిద్దార్థ, మాజీ ఎంపీటీసీ వెంకట్రాం నాయక్, వీడీసీ అధ్యక్షుడు గోపూరు నరేష్‌రెడ్డి, దేవేందర్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

■ ఆరోగ్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో..



నిజామాబాద్‌నాగారం: నగరంలో బుధవారం స్వచ్ఛంద సేవాసంస్థ 'ఆరోగ్య చైతన్య వేదిక' క్యాలెండర్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి పద్మావతి ఆవిష్కరించారు. వేదిక వ్యవస్థాపకుడు, కన్వీనర్ ఘన్పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పితామహ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు చైతన్య కుమార్ సౌజన్యంతో క్యాలెండర్లను ముద్రించినట్లు పేర్కొన్నారు. చైతన్య కుమార్, శంకర్, ప్రవీణ్‌రెడ్డి, జక్కుల మోహన్ పాల్గొన్నారు.

■ పండిత పరిషత్ సంఘం ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌అర్బన్: నగరంలో బుధవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంఘం నూతన క్యాలెండర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పురాణే అజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే గోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కేసి లింగం, శివకుమార్, కోర్వా రాము తదితరులు పాల్గొన్నారు.

■ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో..



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రాజీయోద్దీన్ ఆవిష్కరించారు. టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షుడు మామిడి విట్టల్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు హరిత, ప్రసన్న జ్యోతి, జయలక్ష్మి, అరుణ, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

సమాచారం..

■ దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 19 మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఐదవ తరగతి నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 18నుంచి ఫిబ్రవరి ఆరో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. బడుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 24 నుంచి 30 వరకు అభ్యర్థుల ఎంపిక, సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మే 1నుంచి 10వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94931 15986, 98494 19469 నెంబరు సంప్రదించాలన్నారు.

■ నేడు సీపీఐ సమావేశం

ఖలీల్‌వాడి: నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం సీపీఐ పార్లమెంటరీ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై, సమావేశాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

■ నేడు ఖిల్లా రామాలయానికి ఎంపీ రాక

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నేడు(గురువారం) ఉదయం నగరంలోని ఖిల్లా రామాలయానికి రానున్నారు. ఈ నెలా 22న అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠాపన సందర్భంగా బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు ఖిల్లా రామాలయంలో ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఎంపీతో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

మైనర్లను పనిలో పెడితే చర్యలు



బడిబయట ఉన్న బాలుడితో అధికారులు

ఆర్మూర్‌టౌన్: మైనర్లను దుకాణాల్లో పనికి చేర్చుకుంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని చైల్డ్ వెల్ఫేర్ అధికారి అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని చైల్డ్ వెల్ఫేర్ అధికారులు 'ఆపరేషన్ స్మైల్' స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బడి మానేసిన చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి అనిల్ మాట్లాడుతూ.. పిల్లలను కచ్చితంగా పాఠశాలకు పంపించాలన్నారు. పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు, షీటీం సభ్యులు సుమతి, విఘ్నేష్, గంగనర్సయ్య, వినయ్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయినింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కార్యక్రమానికి హాజరైన బీఎల్‌వోలు

కమ్మర్‌పల్లి: ఈనెల 20, 21 తేదీల్లో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న ఓటరు స్పెషల్ క్యాంపెయినింగ్ డేని వినియోగించుకోవాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిర్ణీత తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, పేర్ల తొలగింపు కోసం దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీటీ భాస్కర్, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద



తహసీల్దార్ కార్యాలయం వద్ద కోతులు

ఇందల్వాయి: ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద కోతుల బెడద తీవ్రంగా ఉంది. సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగిస్తున్న ఈ కార్యాయంలో సరైన వసతులు లేక ఇప్పటికే సిబ్బంది అవస్థలు పడుతున్నారు. దీనికితోడు కోతుల బెడద ఎక్కువైంది. కార్యాలయంపైనే కోతులు తిష్టవేసి సిబ్బందిని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల సమస్యకు పరిష్కారం చూపాలని సిబ్బందితో పాటు ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పీహెచ్‌సీకి మరమ్మతులు



ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి మరమ్మతుల కోసం ఇటీవల జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి రూ.18.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. రెండు నెలలుగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తవనున్నాయి. పీహెచ్‌సీలో గతంలో నీటి వసతి, మూత్రశాలలు, విద్యుత్ తదితర సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. పనులు పూర్తయితే ప్రజలతో పాటు ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమస్యలు కూడా తీరనున్నాయి.

ప్రజా చైతన్య కార్యక్రమాలను జయప్రదం చేయండి

ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నెల రోజులపాటు నిర్వహించే ప్రజా చైతన్య కార్యక్రమాలను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజా చైతన్య కార్యక్రమాల్లో భాగంగా జనవరి 20న జిల్లా సదస్సు, 26న ట్రాక్టర్ ర్యాలీ, జనవరి 27 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు విజయ, నన్నేసాబ్, కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్, ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సభ్యులు కృష్ణ, గంగాధర్ ఉన్నారు.

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ మెడికల్ భవనం నుంచి వృథా నీరు వచ్చి బస్టాండ్ ప్రాంతంలో చేరుతున్నదని, దుర్గంధం వెదజల్లుతున్నదని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కుతాడి ఎల్లయ్య అన్నారు. డ్రైనేజీ నీళ్లు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బస్టాండ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ అంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. బస్టాండ్ చుట్టుపక్కల ఉన్న హోటళ్లలో ప్రజలు టిఫిన్లు చేసి అనారోగ్యానికి గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీదేవి కాంప్లెక్స్ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోగాటి భూమన్న, సిద్దాల నాగరాజు, చెరుకు నారాయణ, ఓంకార్, ఫిరోజ్‌ఖాన్, కిషన్, గంగా నర్సయ్య, వెంకటేశ్, నరేందర్, నదీమ్‌భాయ్, దీపేందర్ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో సౌకర్యాలు కల్పించాలి



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ ప్రతినిధులు



సర్పంచ్ లింబ్యానాయక్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో అన్నదాతలకు వసతులు కల్పించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సిబ్బందికి సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే భూపతి రెడ్డిని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఎన్నికల్లో విజయం సాధించడంపై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో పసుపు సీజన్ ప్రారంభం కానుందని, మార్కెట్ కమిటీని సందర్శించాలని కార్యదర్శి ఎమ్మెల్యేను కోరారు. రైతులకు మద్దతు ధర వచ్చేలా మార్కెటింగ్‌శాఖ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, గ్రేడ్-2 సెక్రటరీ విజయ్‌కిషోర్, అకౌంటెంట్ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్..

ధర్పల్లి: మండలంలోని (సీతాయిపేట్) గుడితండా సర్పంచ్ సభావాత్ లింబ్యా నాయక్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, నాయకులు రమేష్ నాయక్, మోతిరాం, లక్ష్మణ్, బలరాం, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. జిల్లాకు చెందిన, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవిని కేటాయించింది. దీంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, టపాసులు కాలుస్తూ, సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. మహేష్ కుమార్‌గౌడ్ నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ముప్పాగంగారెడ్డి, దయాకర్ గౌడ్, రాజనరేంద్రగౌడ్, వైశాక్షి సంతోష్, రామర్తిగోపి, సయ్యద్ కైసర్, నరేంద్ర సింగ్, బొబ్బిలి రామకృష్ణ, ప్రీతమ్, లవంగ ప్రమోద్ తదితరులు ఉన్నారు.



నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముళ్ల పొదల తొలగింపు



ఇందిరమ్మ కాలనీలో ముళ్లపొదలను తొలగిస్తున్న నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పెరిగిన ముళ్ల పొదలను మాజీ సర్పంచ్ దేగాం సంజీవ్ బుధవారం జేసీబీ సాయంతో తొలగింపచేశారు. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ప్రభుత్వం సదరు భూమిని కొనుగోలు చేసింది. ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోకపోతే లబ్ధిదారులు డబ్బులు జమ చేశారు. ఆ భూమిలో ప్లాట్లను లేఅవుట్ చేసినప్పటికి ఇంతవరకు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లగా, ప్లాట్లను త్వరగా పంపిణీ చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆ స్థలంలో విపరీతంగా పెరిగిపోయిన ముళ్ల పొదలను మాజీ సర్పంచ్ జేసీబీతో తీయించారు. నాయకులు మహేష్‌రెడ్డి, దిగంబర్, శోభన్, జలంధర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	60	90	దోసకాయ	25	50
దొండకాయ	45	60	ఆలుగడ్డ	16	30
జిర్నుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	40	60
వంకాయ	25	50	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	60
క్యాప్సికం	50	80			

\- సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,800	వెండి (కిలో)	75,600
22 క్యారెట్స్	59,060		

\- నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 గుంటూరుకారం -10.25,1.30, 4.35,7.40,10.45

స్క్రీన్-2 నా సామిరంగ(తెలుగు)-10.20, సైంధవ్(తెలుగు)-1.20, 7.45, 10.35

స్క్రీన్-3 హనుమాన్(తెలుగు)-10.40, 4.30, 7.40
నా సామిరంగ(తెలుగు)-1.45, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 గుంటూరుకారం-9.20,12.40, 4.00,7.20,10.40

స్క్రీన్-2 హనుమాన్(తెలుగు)-9.00,12.20, 3.40,7.00,10.20

స్క్రీన్-3 నా సామిరంగ(తెలుగు)-9.50
సలార్(తెలుగు)-1.00
సైంధవ్(తెలుగు)-4.35,7.35, 10.35

స్క్రీన్-4 హనుమాన్(తెలుగు)-10.00
నా సామిరంగ -1.05,4.15,7.15,10.25

దేవి హనుమాన్(తెలుగు)

నటరాజ్ నా సామిరంగ(తెలుగు)

లలితామహల్ గుంటూరు కారం(తెలుగు)

విజయ్ సైంధవ్(తెలుగు)